క్లుప్తంగా

పాఠశాలల ఆడిట్ వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో చేపడతామన్న ఆడిట్ ప్రక్రియను వేసవి సెలవుల్లో తరువాత జరిగేలా వాయిదా వేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పవ్వుల ఆంజనేయులు కోరారు. ఈ మేరకు డీఈఓ ఎస్ అబ్రహాంకు వినతిపత్రం అందజేశారు.

గుండుగొలను వారపు సంత శుక్రవారానికి వాయిదా

భీమడోలు: గుండుగొలనులో మంగళవారం నిర్వహించాల్సిన వారపు సంతను ఈనెల 7వ తేదీ శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత సోమవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కౌంటింగ్ నియమావళి దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈనెల 6న ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా చూడడం, గుండుగొలను గ్రామం సున్నిత సమస్యాత్మకంగా ఉన్నందున వారపు సంతను ఈనెల 7వ తేదీన నిర్వహించుకోవాలని సంబంధిత సంత నిర్వాహకులను ఆదేశించినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు

భీమడోలు: విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం ఉత్సాహంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాన్ని వినియోగించుకుని విజ్ఞానవంతులుగా మారి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హరిజనపేటకు చెందిన దోసూరి నాగరాజు ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడన్నారు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కోసం గాలింపు చేపట్టారని, ఈ నేపథ్యంలో ఇంటిలో ఒక లెటర్ దొరికినట్లు తెలిపారు. దీంతో సోమవారం నాగరాజు అదృశ్యమైనట్లు తల్లి దోసూరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

నరాలు తెగే ఉత్కంఠ !

- అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- ఆళ్ల నాని గెలుపుపై వైఎస్సార్ సీపీ వర్గాల్లో ధీమా
- నియోజకవర్గంలో మొత్తం 14 మంది పోటీ


కౌంటింగ్‌కు సిద్ధమవుతున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్కంఠకు తెరపడనుంది. ఈ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేసిన నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి గంటలోనే ఒక రౌండు ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అప్పటి నుంచి గంటగంటకూ మరిన్ని రౌండ్ల కౌటింగ్ చేపట్టి వాటి వివరాలను ఎప్పటికప్పు మీడియా ద్వారా వెల్లడించడానికి పౌరసంబంధాల శాఖ ఏర్పాట్లు చేసింది. దీనితో ఏ ప్రాంతంలో ఏ అభ్యర్థికి క్కువ మంది ప్రజలు మద్దతుగా నిలిచారో స్పష్టంకానుంది. దీనితో అభ్యర్థుల భవితవ్యం మధ్యాహ్నం రెండు గంటలలోపే తెలిపోతుందని అంచనా.

నాని గెలుపు నల్లేరుపై నడకే

గత 25 సంవత్సరాలుగా ఏలూరు నియోజకవర్గ ప్రజలకు చిరపరిచితుడిగా, ఐదు సార్లు ఎన్నికల్లో పోటీ చేసి మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలందించిన ఆళ్ల నాని నియోజకవర్గ అభివృద్ధికి చేసిన విశేష కృషి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. నియోజకవర్గంలోని వేలాది మంది పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం, ఏలూరు నగర ప్రజలకు తమ్మిలేరు వరదల ముంపు నివారణకు తమ్మిలేరు ఏటి గట్టుకు రివిట్‌మెంట్ నిర్మించడంలో నాని చూపిన చొరవకు ప్రజలు ఎప్పటికీ ఆయనపై అభిమానం చాటుతూనే ఉంటారు. గతంలో వేసవి వచ్చిందటే తాగునీటికి కూడా ఇబ్బంది పడే ప్రజలకు గోదావరి నీటిని నిల్వ ఉంచేలా 100 ఎకరాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి రెండు పూటలా మున్సిపల్ ట్యాప్‌ల ద్వారా మంచినీరు సరఫరా చేయడానికి చేసిన కృషిని ప్రజలు మరిచిపోలేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా నాని గెలుపు నల్లేరుపై నడకలాంటిదే అని ఆయన అభిమానులు చెబుతుంటారు. పైగా ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఎప్పుడు జరిగినా విజయం నానినే వరిస్తుందనే సెంటిమెంట్ కూడా ప్రజల్లో ఉంది. గతంలో టీడీపీ, ప్రజారాజ్యం, కాంగ్రెస్ పార్టీలు పోటీ చేయగా నాని కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. అనంతరం టీడీపీ, జనసేన, వైఎస్సార్ సీపీ పోటీ చేయగా నాని వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో సైతం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఒక వైపు, కాంగ్రెస్ కూటమి మరో వైపు పోటీ చేయగా నాని వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో మూడో సారి త్రిముఖ పోటీలో విజయం సాధించి చరిత్ర సృష్టించనున్నారని వైఎస్సార్ సీపీ వర్గాలు ఘంటాపదంగా చెబుతున్నాయి.

14 మంది పోటీ

సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు పోటీ చేయడం విశేషం. వీరిలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆళ్ల నాని తిరిగి వైఎస్సార్ సీపీ (ఫ్యాన్ గుర్తు) నుంచి, కూటమి అభ్యర్థిగా బడేటి చంటి (సైకిల్ గుర్తు), కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా సీపీఐ నుంచి బండి వెంకటేశ్వరరావు (కంకి కొడవలి గుర్తు), బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ఎ.రత్నకాంత్ (ఏనుగు గుర్తు), పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా అల్లూరి సత్యనారాయణ రాజు (ఫ్లూట్ గుర్తు), జై భారత్ నేషనల్ పార్టీ నుంచి ములగల జోషి (టార్చ్‌లైట్) పోటీ చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మత్తే బాబి (గాజు గ్లాస్ గుర్తు), రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి షేక్ హుస్సేన్ (ఎలక్ట్రికల్ పోల్ గుర్తు), స్వతంత్ర అభ్యర్థులుగా జిల్లెళ్లమూడి నాగ ఉమా మహేశ్వరరావు, నల్లమెల్లి ప్రసన్న కుమార్, ఎంఎం. నాయుడు, పి.ధనుంజయకుమార్, పోలిశెట్టి తులసీ రామ్, రాజనాల శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. అయితే ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల మధ్యే ఉంటుందని నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. ఈనేపథ్యంలో ఫలితం ఎవరికి అనుకూలంగా రాబోతోందో మరికొన్ని గంటల్లో తెలిసిపోనుంది.

హరికృష్ణను ఆదర్శంగా తీసుకోవాలి


కొవ్వలిలో హరికృష్ణ ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

దెందులూరు: విద్యావంతుడు, ఉపాధ్యాయుడు హరికృష్ణ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అవుతారని దెందులూరు ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్, మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వలి భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అనేక మంది విద్యార్థులకు హరికృష్ణ మార్గదర్శకుడయ్యారని, ఆయన్ని ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. 2023–24లో 10వ తరగతిలో మొదటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన చిరంజీవి, తనుశ్రీ, హర్షగోపాల్, పార్వతి ప్రియాంక, వీరవాణి, హరికుమార్‌కు ప్రతిభా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, రిటైర్డ్ హెచ్ఎం కస్తూరిరావు చేతుల మీదుగా 20 మంది వృద్ధులకు రూ. 18 వేలు, బియ్యం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తాఫ్ అలీ, జీవీఎల్ నర్సింహరావు చేతులు మీదుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికీ రూ.10 వేలు అందజేశారు.

ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలపై వినతి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా నాయకత్వం డీఈఓ ఎస్ అబ్రహాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలల నిర్వహణ గ్రాంట్లకు సంబంధించి ఆడిట్‌ను వేసవి సెలవుల అనంతరం నిర్వహించాలని, అన్ని మండలాల్లో ఒకే విధంగా 1/3 పాఠశాలను పిలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు జిల్లాలో జనరల్ ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఎంఈఓల ద్వారా అందజేయాలని పేర్కొన్నారు. జేవీకే కిట్స్‌ను పాఠశాల పాయింట్లకు సరఫరా చేయాలని, ముంపు మండలాలకు హెల్త్ కార్డులు ఇప్పించాలని కోరారు. 2023 వేసవి సెలవుల్లో ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఈఎల్ మంజూరు చేయాలని, ఎస్ఎస్‌సీ పరీక్షల డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పించాలని పేర్కొన్నారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, ఎలిమెంటరీ పాఠశాలలో టీచర్లను సర్దుబాటు చేయాలని, కొన్ని పాఠశాలల్లో నిర్మాణాల పూర్తికి నిధులు మంజూరు చేయాలని కోరారు. టీచర్లు సెలవులు నష్టపోకుండా చేయాలని, ఇంటర్మీడియట్ బోధించేవారు కింది క్లాసుల సబ్జెక్టులు కూడా బోధించేలా మార్గదర్శకాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని డీఈఓ హామీ ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, జిల్లా కార్యదర్శి ఇ.శివశంకరరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ప్రసాద్ పాల్గొన్నారు.

11 పోలీస్ పికెట్ల ఏర్పాటు

దెందులూరు: సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ డి.మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు దెందులూరు మండలంలో 11 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని దెందులూరు ఎస్సై కె.స్వామి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలమంతా నాలుగు మొబైల్ పోలీస్ పార్టీలు పహారా కాస్తున్నాయన్నారు. గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు జల్లెడ పడుతున్నాయని వివరించారు. 6వ తేదీ వరకు సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉంటాయన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలు, సెల్‌ఫోన్‌లో పోస్టింగులు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. ఇద్దరు, ముగ్గురు కంటే ఏ ప్రాంతంలోనూ గుమ్మిగూడి ఉండకూడదన్నారు. రౌడీషీటర్ల అందరిపై పూర్తి నిఘా ఉందని, ఎవరైనా అల్లర్లు చేసినా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఎన్నికల కేసులో నేరస్తులుగా, రౌడీషీటర్లుగా చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ పక్షానే కొల్లేరు ప్రజలు


కొల్లేరు


వైఎస్సార్ సీపీకి పట్టున్న గుడివాకలంక గ్రామం

- అబ్బయ్యచౌదరికి విజయంపై పందాలు
- చింతమనేనికి మరోసారి షాక్ తప్పదా!

ఏలూరురూరల్: కొల్లేరు గ్రామాల ప్రజలు వైఎస్సార్ సీపీ పక్షానే ఉన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి విజయంపై ఆయా గ్రామాల్లో రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకూ జోరుగా పందాలు సాగుతున్నాయి. ఈ ఐదేళ్ల పాలనలో కొల్లేరు గ్రామాల్లో జరిగిన అభివృద్ధే వైఎస్సార్ సీపీకి మెజార్టీ కట్టబెడుతుందని చెబుతున్నారు. ఏలూరు రూరల్ మండలంలోని 15 గ్రామాల నుంచి కొఠారు అబ్బయ్యచౌదరికి సుమారు 5 వేలు మెజార్టీ వస్తుందని అంచనా వేస్తున్నారు. 2019లో కొల్లేరు ప్రజలు వైఎస్సార్ సీపీకి 1,580 ఓట్లు మెజారిటీని కట్టబెట్టారు. వైఎస్సార్ సీపీకి 13,117 ఓట్లు పోలవ్వగా, టీడీపీకి 11,537 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌కు గట్టి షాక్ తగులనుందని ప్రచారం. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తికోళ్లలంక గ్రామం నుంచి వైఎస్సార్ సీపీకి 81 ఓట్లు మెజారిటీ రాగా, ఈ సారి ఇదే గ్రామం నుంచి 1000కి పైగా ఓట్ల మెజార్టీ వస్తుందని చెబుతున్నారు. దీనికి ఎన్నికల ముందే ఈ గ్రామ ప్రజలు వైఎస్సార్ సీపీకి పూర్తి మద్దతు ప్రకటించడమే కారణం. గత ఎన్నికల్లో పైడిచింతపాడు గ్రామం నుంచి టీడీపీకి 372 ఓట్లు మెజారిటీ వచ్చింది. ఈసారి ఇదే మెజార్టీ వైఎస్సార్‌సీపీకి వస్తుందని చెబుతున్నారు. అబ్బయ్యచౌదరి గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించడమే కారణంగా చెబుతున్నారు. 2019లో మల్కాపురం 546, శ్రీపర్రులో 604, గుడివాకలంకలో 647, మాదేపల్లిలో 233 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇదే మెజారీలు తిరిగి వైఎస్సార్ సీపీకి వస్తుందని లెక్కలేస్తున్నారు. గతెన్నికల్లో పెదయాగనమిల్లి, కోమటిలంక, కలకుర్రు గ్రామాల్లో మాత్రమే టీడీపీకి మెజార్టీ వచ్చింది. ఇప్పుడు ఆ గ్రామాల్లోనూ వైఎస్సార్ సీపీ హవా నడిచిందంటున్నారు. 2014లో కొల్లేరు గ్రామాల నుంచి చింతమనేని ప్రభాకర్‌కు 4,728 ఓట్లు మెజారిటీ వచ్చింది. ఇప్పుడు అబ్బయ్యచౌదరి ఆ రికార్డు బ్రేక్ చేస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు చెబుతున్నారు.

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొల్లేరు గ్రామాల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు

గ్రామం	వైఎస్సార్ సీపీ	టీడీపీ	మెజార్టీ
మల్కాపురం	1188	642	546
చాటపర్రు	2157	2020	137
కోటేశ్వరదుర్గాపురం	334	330	4
జాలిపూడి	1332	1219	113
మాదేపల్లి	1701	1468	233
కాట్లంపూడి	357	256	101
శ్రీపర్రు	1596	992	604
కలకుర్రు	41	584	543 (టీడీపీ)
కోమటిలంక	339	380	41 (టీడీపీ)
గుడివాకలంక	1686	1039	647
మొండికోడు	343	253	90
పెదయాగనమిల్లి	115	214	99 (టీడీపీ)
కొక్కిరాయిలంక	204	125	79
పైడిచింతపాడు	425	797	372 (టీడీపీ)
ప్రత్తికోళ్లలంక	1299	1218	81


కోడిపందాల ఆడేవారిని, వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

15 మంది అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో పోణంగిలోని ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తుండగా సోమవారం ఉదయం సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై నవీన్ తన సిబ్బందితో దాడి చేశారు. 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.30 వేలు నగదు, ఒక కోడి, 15 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

శివునికి వెండి నాగాభరణం అలంకరణ

పెదపాడు: సత్యవోలు గ్రామంలో ఇటీవల నిర్మాణం చేసిన శివాలయంలోని శివలింగానికి పెదపాడు గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మణరావు కేజీ వెండితో సుమారు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని సమర్పించారు. ఈమేరకు సోమవారం సత్యవోలు రామాలయం సెంటర్ నుంచి భక్తులు వెండి నాగాభరణాన్ని దాత తలపై పెట్టుకుని ఊరేగింపుగా బాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామి వారికి సమర్పించారు. స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించే ముందు శివునికి పంచామృతాలతోను పండ్ల రసాలు, కొబ్బరినీరు, గంధం, విభూది, పన్నీరులతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అభినాష్ వేద మంత్రోచ్చరణలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు బొమ్మి ప్రభాకరరావు, కొట్నాన వెంకట్రావు, టంగుడు ఆంజనేయులు, తెంటు శ్రీనివాసరావు, రంభనాగరాజుతో పాటు ఇతర సభ్యులు గ్రామంలో పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07, 10
బెండకాయలు	20	కంద	72
పచ్చిమిర్చి	100-108	బీట్‌రూట్	32
కాకర కాయలు	44-56	కీరా దోస	36
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	170
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	40
క్యారెట్	36-50	పాలకూర	15
దొండకాయలు	20	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	48

మద్దిలో నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం ఉపాలయంలో కొలువైయున్న వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. గర్భగుడిలో కొలువైయున్న మద్ది అంజన్నకు ప్రభాత సేవ, నిత్య అర్చన, నిత్యహోమాలు, బలిహరణ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మద్ది క్షేత్రంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఈవో కొండలరావు తెలిపారు. మహాపూర్ణాహుతి, దీక్షా విరమణ, స్వామి వారికి అభిషేకాలు, ధ్వజారోహణ, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు పుష్కరిణిలో స్వామి వారి తెప్పోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా సోమవారం రూ.2,00,132 విరాళంగా అందజేశారు. టి.నరసాపురం మండలం మెట్టగూడెంనకు చెందిన నంద్యాల రాటాలరాజు రూ.1,00,016, ఏలూరు వాసి మదిరెడ్డి శేష చలపతి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు విరాళం బాండ్ పత్రాలను అందించి, అభినందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

వృద్ధాశ్రమానికి అనాథ మహిళ

జంగారెడ్డిగూడెం: మతి స్థిమితం కోల్పోయిన అనాథ మహిళను వైద్య పరీక్షల అనంతరం ఐసీడీఎస్ అధికారులు నిడదవోలు వృద్ధాశ్రమానికి తరలించారు. జంగారెడ్డిగూడెం సీడీపీఓ పి.బ్యూల తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద సుమారు 60 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని మహిళను స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. మహిళ పేరు వీరమ్మ అని, ఆమె రెండు కాళ్లకు దెబ్బలు తగిలి నడవలేని స్థితిలో ఉందని చెప్పారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో రెండు రోజులపాటు ఆశ్రయం కల్పించి, ప్రథమ చికిత్స అందించారు. సోమవారం ఉదయం ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి నిడదవోలు జీఎంఎస్‌కే వృద్ధాశ్రమానికి తరలించామన్నారు. దీనికి మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు సహకరించారని బ్యూల తెలిపారు.